www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శనివారం
05 ఏప్రిల్ 2025

విలేఖరులు కావలెను


కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003





# యూనివర్సిటీల్లో కోర్సులు మార్చండి

- వైస్ ఛాన్సలర్లకు సూచించిన సీఎం రేవంత్..
- విద్యావిధాన పత్రం రూపొందించండి
- మెరుగైన విద్యా వ్యవస్థకు రూపకల్పన చేయండి
- జీవన నైపుణ్యాలు పెంపొందించే దిశగా ఉండాలి
- భాష.. విషయ పరిజ్ఞానం రెండూ ప్రధానమే
- విద్యా కమిషన్ సమీక్షలో ముఖ్యమంత్రి

2లో



## పార్లమెంట్ నిరవధిక వాయిదా!

న్యూ ఢిల్లీ: గందరగోళం మధ్య ప్రారంభమైన లోక్ సభ సమావేశాలు శుక్రవారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. దాంతో జనవరి 31న ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు ముగిసినట్లయ్యింది. ఈ సమావేశాల్లో వక్ఫ్ సవరణ బిల్లు 2025తో సహా 16 బిల్లులకు ఆమోదం లభించిందని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. కాంగ్రెస్ వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు.

### ఆమోదం పొందిన బిల్లులు..

1. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు–2024
2. రైల్వేస్ (సవరణ) బిల్లు–2024
3. విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు–2024
4. ఆయిల్ ఫీల్డ్స్ (నియంత్రణ, అభివృద్ధి) సవరణ బిల్లు–2024
5. బాయిలర్స్ బిల్లు–2024
6. గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు–2024
7. వక్ఫ్ (సవరణ) బిల్లు–2024
8. ముసల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లు–2024
9. ది బిల్స్ ఆఫ్ లాడింగ్ బిల్లు–2024
10. సముద్ర బిల్లు ద్వారా వస్తువుల రవాణా–2024
11. కోస్టల్ షిప్పింగ్ బిల్లు–2024
12. మర్చంట్ షిప్పింగ్ బిల్లు–2004
13. ఆర్థిక బిల్లు–2025
14. విమాన వస్తువులపై ఆసక్తి రక్షణ బిల్లు–2025
15. త్రిభువన్ సహకరి యూనివర్సిటీ బిల్లు–2025
16. వలస, విదేశీయుల బిల్లు–2025



# యూనివర్సిటీ వైపు రావొద్దు

కలంజ్యోతి, హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండల పరిధిలోని కంచె గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్పిటీ భూముల వ్యవహారంపై పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ భూముల వద్దకు ఎవరూ రావొద్దని ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా బయటి వ్యక్తులపై నిషేధం విధించింది. సంబంధం లేని వ్యక్తును ఆ భూముల్లో అడుగు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఎవరైనా ఆంక్షలు అతిక్రమించి.. ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు మాదాపూర్ జోన్ డీసీపీ డాక్టర్ వినీత్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. కంచె గచ్చిబౌలి రెవెన్యూ సర్వే నం.25లో గల 400 ఎకరాల భూమిపై ప్రస్తుతం రాద్ధాంతం నడుస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. మరోవైపు ఈ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్కడ కొనసాగుతున్న పనులు తక్షణమే ఆపేయాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు చర్యలు నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.



# జగిత్యాల అభివృద్ధి కృషి చేయాలి

## ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వినతి

**కలంజ్యోతి, జగిత్యాల :** జగిత్యాల నలువైపుల అభివృద్ధికి కృషి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ న్యూఢిల్లీలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో వినతపత్రం అందజేశారు. శుక్రవారం కేంద్ర పట్టణాభివృద్ధి గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ ను కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణ అభివృద్ధి పనులపై చర్చించారు. జగిత్యాల పట్టణం జిల్లాగా ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రం త్వరతగతిన నలువైపులా అవృద్ధి చెందుతూ విస్తరిస్తుందన్నారు. జగిత్యాల పట్టణాన్ని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంటు అవసరం కూడా ఉందన్నారు. జిల్లా కేంద్రంలో రూ.400 కోట్ల అంచనాతో డీపీఆర్ తయారు చేయడం జరిగిందని వివరించారు. జగిత్యాల అభివృద్ధి దిశగా అడుగులు వేసేందుకు నిధులు మంజూరుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధి గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ సీనియర్ నాయకులు మోరపల్లి సత్యనారాయణరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.



# యూనివర్సిటీల్లో కోర్సులు మార్చండి

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లోని కోర్సులలో మార్పులు రావాలని.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇవి ఉండాల ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైస్ ఛాన్సలర్లకు సూచించారు. మార్కెట్‌లో డిమాండున్న కోర్సు లను బోధించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా వర్సిటీలు పని చేయాలని అన్నారు. విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో ముఖ్యమంత్రి సమావేశ మయ్యారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు గ్రామీ ణ ప్రాంతాల నుంచి, ఆర్థిక స్థోమత లేని కుటుం బాల నుంచే విద్యార్థులు వస్తున్నారని, వారి భవి ష్యత్తును తీర్చిదిద్దే బోధనకు వర్సిటీలు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఆర్థికంగా స్థోమత ఉన్న కు టుంబాల పిల్లలు మార్కెట్‌లో డిమాండున్న కోర్సులను ఎంచుకొని ప్రైవేటు విశ్వవిద్యాలయాల వైపు వెళ్తున్నారని, వారితో ఎదురయ్యే పోటీని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఎదుర్కోవాలంటే డిమాండున్న కోర్సులనే బోధించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో నియమితు లైన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారన్న భావనతో పలు విశ్వవిద్యాలయాల్లో పెద్దగా ప్రాధా న్యం లేని కోర్సులను బోధిస్తున్నారని, వాటిని రద్దు చేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. వర్సిటీలు కొందరు ప్రొఫెసర్లకు రిహాబిలిటేషన్ సెంటర్లుగా మారొద్దని, అలాంటి వారికి అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలు అప్పగించాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ్యాల్లో ప్రొఫెసర్ల కొరత, భవనాల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను వీసీలు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. వర్సిటీలను తీర్చిదిద్దడానికి అవసరమైన నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. విశ్వవిద్యాలయాల ఉమ్మడి సమస్యలు, అలాగే వర్సిటీల వారిగా ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావుతో సమావేశమై చర్చించాలని, ఆయా అంశాలపై ప్రభుత్వానికి సమగ్రమైన నివేదిక సమర్పించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.





## విద్యావిధాన పత్రం రూపొందించండి

రాష్ట్రంలో మెరుగైన విద్యా వ్యవస్థ రూపకల్పనకు సమగ్ర విధాన పత్రం రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి విద్యా కమిషన్‌ను ఆదేశించారు. ఉత్తమ విద్యా వ్యవస్థ ఏర్పాటుకు ఎంత వ్యయమైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అద్దం పట్టేలా విధాన పత్రం ఉండాలన్నారు. అదే సమయంలో అది ఆచరణకు దూరంగా ఉండకుండా చూసుకోవాలని సీఎం హితవు పలికారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో లోపాలు.. తీసుకురావల్సిన సంస్కరణలపై ముఖ్యమంత్రి ఐసీసీసీలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా రంగానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, ఉపాధ్యాయుల నియామకం, అమ్మ ఆదర్శ కమిటీలు, పుస్తకాలు, యూనిఫాంల పంపిణీతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీల నిర్మాణాన్ని సీఎం వివరించారు. ప్రాథమిక దశలో అందే విద్యతోనే పునాది బలపడుతుందని చెప్పారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తే ఉన్నత చదువుల్లో విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించగలరని ఆయన అభిప్రాయపడ్డారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల స్థాయిలో తీసుకురావల్సిన మార్పులపై సమాజంలోని వివిధ సంఘాలు, ప్రముఖులతో చర్చించి మెరుగైన విధాన పత్రం రూపొందించాలని సీఎం సూచించారు. మనకు ఉన్న వనరులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యా వ్యవస్థలో తెలంగాణ అగ్రగామిగా ఉండేందుకు దోహదపడేలా సూచనలు, సలహాలు ఉండాలని సీఎం సూచించారు. వివిధ రాష్ట్రాల్లోని పర్యటనలు, ఆయా రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ప్రాథమిక విద్యలో అనుసరిస్తున్న విధానాలను విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 1960 దశకం నుంచి ప్రస్తుతం వరకు విద్యా వ్యవస్థలోని తీసుకువచ్చిన పలు సంస్కరణలు క్రమేణా విద్యార్థుల సృజనాత్మక శక్తి, ఆలోచనా ధోరణిని ఎలా హరించి వేశాయో ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ వివరించారు. విద్యా వ్యవస్థలో మార్పులకు పరీక్షల విధానం, పాఠశాలల్లో తనిఖీలు, జీవన నైపుణ్యాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన సూచించారు.

# సన్నబియ్యం పంపిణీ సజావుగా కొనసాగించండి

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



**కలంజ్యోతి, నిర్మల్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ ప్రక్రియను పకడ్బందీగా కొనసాగించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ లోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి కలెక్టర్లతో సన్నబియ్యం పంపిణీ ప్రక్రియపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇప్పటివరకు జిల్లాల వారీగా పంపిణీ చేసిన సన్నబియానికి సంబంధించిన వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు ఉన్న పేద ప్రజలందరికీ ఉచిత సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి నిరుపేద ప్రజలకు అందాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంతో తయారుచేసిన ఆహారాన్ని వారితో కలిసి స్వీకరించాలని సూచించారు. కాగా.. నిర్మల్ జిల్లాలో ఇప్పటివరకు పంపిణీ చేసిన సన్నబియానికి సంబంధించిన వివరాలను మంత్రికి, సీఎస్ కు కలెక్టర్ అభిలాష వివరించారు. సన్నబియ్యం పంపిణీ పట్ల జిల్లా ప్రజల నుండి మంచి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. త్వరలోనే సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంతో తయారుచేసిన భోజనాన్ని స్వీకరిస్తామన్నాని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, డీఎం సుధాకర్ పాల్గొన్నారు.



కలంజ్యోతి 3
శనివారం 05.04.2025 General News

# భూ వివాదాలకు పరిష్కారం చూపాలి

## కలెక్టర్ అభిలాష అభినవ్



**కలంజ్యోతి, నిర్మల్ :** జిల్లా వ్యాప్తంగా ఉన్న అటవీ, రెవెన్యూ భూ వివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. అటవీ, రెవెన్యూ భూ వివాదాల పరిష్కారంపై అధికారులతో ఆమె జిల్లాస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీ, రెవెన్యూ శాఖల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఎకరా భూమి విలువైనదని, అటవీ, రెవెన్యూ భూముల హద్దులను తక్షణమే గుర్తించి, రెగ్యులర్ సర్వేలు నిర్వహించాలన్నారు. అక్రమంగా ఆక్రమించిన ప్రాంతాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా సర్వే అధికారులు మ్యాప్ లను తయారు చేయాలని, అటవీ, రెవెన్యూ శాఖలలో ప్రజల భూ సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు కేసులతో ముడిపడి ఉన్న భూ సమస్యలకు సంబంధించి కోర్టుల ఆదేశాల ప్రకారం అటవీ, రెవెన్యూ భూవివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి నాగిని భాను, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న జయంతి ఏర్పాట్లపై సమీక్ష

## అధికారులకు సూచనలు చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కలంజ్యోతి, మల్యాల :** కొండగట్టు శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో రానున్న చిన్నజయంతి ఉత్సవాల ఏర్పాటుపై అధికారులతో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎస్పీ అశోక్ కుమార్ తో కొండగట్టులో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీకాంత్ రావు, వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల నుండి లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు అన్ని విధాల వసతులు కలిపించాలన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఆయనకు పూలమాల వేసి, ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. తదుపరి ఆలయ పరిసరాలు పర్యవేక్షిస్తూ పలు అంశాలు చర్చించారు.
సమావేశంలో ఆలయ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, దారం ఆదిరెడ్డి, రాం లింగారెడ్డి, ముత్యం శంకర్, మ్యాక లక్ష్మణ్, నేరెళ్ల సతీష్ రెడ్డి, తాళ్ల హరినాథ్, శనిగరపు తిరుపతి, కంటే అరుణ్, కోరేపు వెంకటేష్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.






# వారసంత, వాటర్ ప్లాంట్ లీజుకు వేలం

**కలంజ్యోతి, మల్యాల :** మండల కేంద్రంలో వారసంత, షాపింగ్ కాంప్లెక్స్, వాటర్ ప్లాంట్ కు జీపీ కార్యదర్శి శ్రీకాంత్ శుక్రవారం వేలం నిర్వహించారు. ఈ వేలం గ్రామస్తుల మధ్య పోటాపోటీగా జరింగింది. స్పెషల్ ఆఫీసర్ మనోజ్ కుమార్ వేలం పాటను పర్యవేక్షించారు. మొత్తం 8 మంది వేలంలో పాల్గొనగా వారసంతను మ్యాదరి సుదర్శన్ రూ:3,26,500కు, వాటర్ ప్లాంట్ ను జలంధర్ రూ.94,710కు దక్కించుకున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ లోని పలు షాపులను పాత యజమానులకు అదనంగా 5శాతం పెంచి తీసుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దూస వెంకన్న, బట్టు పవన్, కేశెట్టి సంతోష్, దొంతరవేణి శేఖర్, యాగండ్ల పరుశరాం, బేతి లక్ష్మీనారాయణ, మిట్టపెల్లి హరికృష్ణ, ముసుకు దేవయ్య, అలంకార్, హరీష్, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ పంటసాగుపై రైతులకు అవగాహన

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని రాంపూర్ లో పామాయిల్ పంట వల్ల కలిగే లాభాల గురించి రైతులకు మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్ ఆధ్వర్యంలో అవగాహన కలిపించారు. మూడు ఎకరాల పైన ఉన్న రైతులు పామాయిల్ సాగు చేపట్టాలన్నారు. ప్రతి మొక్కకు 90శాతం రాయితీతో రూ.20 చొప్పున ఎకరానికి 57 మొక్కలకు గాను రూ.1140 డీడీలు కట్టి పామాయిల్ సాగుకు రిజిస్టేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లోహియా కంపనీ ప్రతినిధి అనిల్, శ్రీనివాస్, కారుణ్య పాల్గొన్నారు.




# టీపీసీసీ సేవాదళ్ సెక్రటరీగా బోగోజీ ముకేశ్ ఖన్నా

**కలంజ్యోతి, జగిత్యాల :** టీపీసీసీ సేవాదళ్ జిల్లా సెక్రటరీగా బోగోజీ ముకేశ్ ఖన్నా నియామకం చేపట్టినట్లు ఆల్ ఇండియా చీఫ్ ఆర్గనైజర్ లాల్ జీ దేశాయ్ పేర్కొన్నారు. 2007 నుంచి కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్ యూఐ నుండి గుర్తింపు ఉన్న ఖన్నా జగిత్యాల నుంచి కాంగ్రెస్ లో రాష్ట్రస్థాయి పదవి వరించడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# బల్దియా కార్మికులకు దుస్తువులు అందజేయాలి

**ఏఐటీయూసీ మున్సిపల్ గౌరవ అధ్యక్షులు వెన్న మహేష్**

**కలంజ్యోతి, జగిత్యాల :** పట్టణ మున్సిపాలిటీలో ఏడాదిన్నర నుండి పారిశుద్ధ్య కార్మికులకు దుస్తువులు, నిత్యావసర వస్తువులు ఇవ్వడం లేదని ఏఐటీయుసి జగిత్యాల మున్సిపల్ గౌరవ అధ్యక్షులు వెన్న మహేష్ ఆరోపించారు. మున్సిపల్ లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు డ్రెస్సులు, సబ్బులు, నూనెలు, చెప్పులు 18 నెలలు గడిచిన అధికారులు ఇవ్వలేదనీ, గత ఆరు నెలల క్రితం దేవిశ్రీ గార్డెన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ అధికారులు కార్మికులకు ఇవ్వాల్సిన వస్తువులను వెంటనే ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వకపోవడం శోచనియమన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన డ్రెస్సులు, ఇతర వస్తువులు వెంటనే అందించాలని లేకుంటే జగిత్యాల మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని వెన్న మహేష్ తెలిపారు.

# మనస్థాపంతో వివాహిత ఆత్మహత్య

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని బల్వంతాపూర్ గ్రామానికి చెందిన షేక్ బర్కత్ బీ (23) తన వ్యక్తిగత సమాచారం వైరల్ చేయడాన్ని భరించలేక మనస్థాపంతో ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ నరేష్ కుమార్ కథనం మేరకు.. గ్రామంలో కాశీనగర్ కాలనీకి చెందిన షేక్ బర్కత్ శుక్రవారం అర్ధరాత్రి తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడింది. అయితే ఆత్మహత్యకు పాల్పడిన బర్కత్ తన చావుకు కారణంపై ఉర్దూలో సూసైడ్ నోట్ రాసింది. అందులో భర్తతో పాటు, కుటుంబ సభ్యులకు సారీ చెప్పి.. తనచావుకు గ్రామానికి చెందిన హుస్సేన్ కారణమంటూ పేర్కొంది. మృతురాలి భర్త అబ్దుల్ ఉపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. తన చెల్లెలు వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన వీడియో షేక్ హుస్సేన్ అనే వ్యక్తి వైరల్ చేయడాన్ని భరించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్ లో రాసింది. మృతురాలి సోదరుడు సయ్యద్ ఆదాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా, హుస్సేన్ ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

# ఎస్సీ, ఎస్టీ వర్గాల పట్ల మానవీయ కోణంలో స్పందించాలి

**తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**







**కలంజ్యోతి, జగిత్యాల :** అధికారులు ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు సమస్యలను మానవీయ కోణంలో స్పందించి, వారి అభ్యున్నతికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం జగిత్యాల కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలపై వెంకటయ్య, కమిషన్ సభ్యులు నీలాదేవి, శంకర్, రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ తో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను, విద్య, వైద్యం సంక్షేమ రంగంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను అడిషనల్ కలెక్టర్ లత వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పూర్తిగా వారికే కేటాయించాలన్నారు. నిధులు పక్కదారి పడకుండా చూడాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రతినెల చివరి రోజున ఖచ్చితంగా పౌర హక్కుల దినోత్సవం జరిగేలా చూడాలన్నారు. ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టాన్ని అమలు కు కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యా చట్టాన్ని తూచ తప్పకుండ పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ అశోక్ కుమార్, ఆర్డీఓలు మధుసూధన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్ కుమార్, డీఏసీపీలు రఘుచందర్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఏవీ శాశ్వతం కాదు

హీరోయిన్ హెబ్బా పటేల్ 'కుమారి 21 ఎఫ్' సినిమాతో ఎంట్రీ మంచి గుర్తింపు తెచ్చుకున్నది. ఆ తర్వాత అంత స్థాయి సినిమా రాకపోవడంతో అవకాశాలు తగ్గిపోయాయి. ఆ తర్వాత 'ఓదెల రైల్వే స్టేషన్' ఈ భామకు కలిసి వచ్చింది. ఇప్పుడు ఓదెల2 లో కూడా నటిస్తుంది ఈ భామ. ఆ చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా హెబ్బా ఆసక్తికర విషయాలు తెలిపింది. ' నాలోని నటిని ఆవిష్కరించింది 'ఓదెల రైల్వే స్టేషన్'. ఈ సినిమాకి కొనసాగింపు ఈ స్థాయిలో ఉంటుందని, అందులోనూ నేను నటిస్తానని ఊహించలేదు. దర్శకుడు సంపత్ నంది నన్ను నమ్మడంతోనే 'ఓదెల రైల్వే స్టేషన్' చేశా. ఆ సినిమా నా కెరీర్‌కి ఓ మలుపు. ఆ కథ, అందులో నా పాత్ర చెప్పినప్పుడు నేను ఇలాంటి పాత్రని చేయగలనా? అని అడిగా. కానీ సంపత్ నంది ప్రయత్నించి చూడమని చెప్పారు. ఆయన నమ్మకం నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆ సినిమాలోని రాధ పాత్ర నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అయితే దానికి కొనసాగింపుగా మరో సినిమా ఉంటుందని అప్పట్లో ఊహించలేదు. తొలి భాగం కంటే భారీగా 'ఓదెల 2' రూపొందడం ఎంతో తృప్తినిచ్చింది. తొలి భాగం సినిమా హత్య నేపథ్యం లో ఆసగే కథ అయితే, ఇది అతీంద్రీయ శక్తుల నేపథ్యంలో సాగే ఓ థ్రిల్లర్ చిత్రమిది. ఈ సినిమాలో నాకు సోదరిగా తమన్నా నటించారు. తను, నేను కలిసి కొన్ని సన్నివేశాల్లో కనిపిస్తాం. నా కెరీర్ పదేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది. ఎన్నో ఆటుపోట్లు ఎదురయ్యాయి. అయినా కెరీర్ పరంగా తృప్తిగా ఉన్నాను. విజయాలు, పరాజయాలు ఏవీ శాశ్వతం కాదు, పనిచేస్తూ వెళ్లడమే ముఖ్యమని నమ్మా' అని హెబ్బా చెప్పింది.

